

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


**మంచిమాట**

పైవారితో గౌరవంగా సాటివారితో స్నేహంగా మెలగడం కాదు, తనకన్నా తక్కువవారితో మెలిగే తీరే వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.


Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్   సంపుటి -14   సంచిక - 236   పేజీలు - 08   వెల - 03/-   శనివారం 22-08-2026


## భూముల వేలంపై సుప్రీం కీలక తీర్పు!

వేలాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం



- రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలంపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ
- గచ్చిబౌలి భూములకు, ఈ భూములకు సంబంధం లేదన్న తెలంగాణ ప్రభుత్వం
- ఏవైనా అభ్యంతరాలుంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచన

తెలంగాణలోని రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) రాయదుర్గం పాన్ మక్తాలోని సుమారు 11 ఎకరాల భూమిని వేలం వేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎకరాకు కనీస ధరను రూ.175 కోట్లుగా నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ

మిగతా 2లో

## అవినాశ్ రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ తనిఖీలు

- వివేకా హత్య కేసులో ఈడీ దర్యాప్తు ముమ్మరం
- ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి నివాసాల్లో సోదాలు
- మనీ లాండరింగ్ కోణంలో ఏకకాలంలో 7 చోట్ల తనిఖీలు
- కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను సీజ్ చేసిన అధికారులు



## రేవంత్ అమెరికా టూర్‌కు నో.. కారణం ఇదే!

ప్రస్తుతం లండన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి

- రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు ఎంఈఏ అనుమతి నిరాకరణ
- పర్యటన కార్యక్రమం హోదాకు, ఉద్దేశానికి తగినట్లు లేదని కేంద్రం స్పష్టీకరణ
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి
- అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని సీఎంవో ప్రకటన




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమం లేదని భావించడంతో అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించినట్లు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు వారి

మిగతాది 2లో




2

## టీసీఎస్ ఉద్యోగుల పై ఎలాంటి నిఘా లేదు..

● ఉద్యోగుల ల్యాప్‌టాప్‌లపై నిఘా పెడుతున్నామన్న ఆరోపణలను ఖండించిన టీసీఎస్ ● వ్యక్తిగత కార్యకలాపాలను తాము ట్రాక్ చేయడం లేదని స్పష్టీకరణ ● నెట్‌వర్క్ భద్రత, పనితీరును మెరుగుపరిచేందుకే టూల్స్ వాడుతున్నట్లు వెల్లడి ● ఇది వ్యక్తిగత నిఘా కాదని, మ్యాక్రో-లెవల్ నెట్‌వర్క్ పర్యవేక్షణ మాత్రమేనని వివరణ

## టాలీవుడ్‌లో విషాదం..

## దిగ్గజ నటి షావుకారు జానకి కన్నుమూత

వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన దిగ్గజ నటి

- చెన్నై కావేరీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- శుక్రవారం మధ్యాహ్నం మరణించినట్లు నాజర్ వెల్లడి
- 1950లో 'షావుకారు' చిత్రంతో సినీ అరంగేట్రం



తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో తనదైన ముద్ర వేసిన దిగ్గజ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో ఇటీవలే ఆమె చెన్నైలోని కావేరీ ఆసుపత్రిలో చేరారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచినట్లు నటీనటుల సంఘం అధ్యక్షుడు నాజర్ ప్రకటించారు. రాజమహేంద్రవరానికి చెందిన శంకరమంచి జానకి, సినీ రంగంలో 'షావుకారు జానకి'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1950లో ఎల్‌వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన తెలుగు చిత్రం 'షావుకారు'తో ఆమె వెండితెర అరంగేట్రం చేశారు. ఆ సినిమా విజయం తర్వాతే ఆమె పేరుకు ముందు 'షావుకారు' చేరింది.

మిగతాది 2లో

## ఎన్‌హెచ్ఏఐ కీలక నిర్ణయం..

దేశవ్యాప్తంగా 121 టోల్‌ప్లాజాలకు డిజిటల్ లోకల్ పాస్ సౌకర్యం


- టోల్‌ప్లాజాకు 20 కి.మీ. పరిధిలోని స్థానికులకు రూ.350కే నెలవారీ పాస్
- రాజమార్గయాత్ర మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు
- ఫాస్టాగ్‌కు లింక్ అయ్యే ఈ పాస్ కోసం డిజిటల్‌గానే పత్రాల వెరిఫికేషన్




జాతీయ రహదారులపై ప్రయాణించే స్థానిక వాహనదారులకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఒక శుభవార్త అందించింది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 121 టోల్‌ప్లాజాల వద్ద డిజిటల్ లోకల్ పాస్ సౌకర్యాన్ని విస్తరించింది. ఈ పథకం కింద, టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలో నివసించే అర్హులైన స్థానికులు కేవలం రూ.350 చెల్లించి నెలవారీ పాస్‌ను పొందవచ్చు. ఈ పాస్‌తో ఆ నిర్దిష్ట టోల్‌ప్లాజా వద్ద నెల రోజుల పాటు ఎన్నిసార్లైనా ప్రయాణించే వెసులుబాటు కలుగుతుంది.

మిగతాది 2లో

## ఆయుర్వేద చికిత్స కోసం నేడు కేరళకు పవన్



కేరళకు బయలుదేరనున్న ఉపముఖ్యమంత్రి

- భుజం నొప్పికి చికిత్స కోసం కేరళకు పవన్ కల్యాణ్
- శస్త్రచికిత్స తర్వాత విశ్రాంతి పెద్దగా తీసుకోకుండా విధుల్లో చేరిక
- భుజానికి వాపు, జ్వరం రావడంతో వైద్యుల సూచన
- ఆయుర్వేద చికిత్సతో పూర్తిస్థాయిలో కోలుకోవడమే లక్ష్యం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రేపు కేరళకు పయనం కానున్నారు. తన భుజం నొప్పికి ఆయుర్వేద చికిత్స తీసుకునే నిమిత్తం ఆయన శనివారం కేరళకు వెళ్లనున్నట్లు జనసేన పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల పవన్ కల్యాణ్ తన కుడి భుజం 'రొటేటర్ కఫ్' గాయానికి ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం కొంతకాలం పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని వైద్యులు ఆయనకు సూచించారు.

మిగతాది 2లో

## కొండా ఫ్యామిలీపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం!

- కొండా సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం
- 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీల భేటీ
- వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడంపై అభ్యంతరం

2



తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా సమావేశమై చర్చించారు.

## యువతే టార్గెట్..


## రాహుల్ గాంధీ రాజకీయ వ్యూహంలో కొత్త మార్పు!



● జెన్-జీపై రాహుల్ గాంధీ ప్రత్యేక దృష్టి ● యువతుల సమస్యలపై నేరుగా చర్చ ● 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంతో క్షేత్రస్థాయిలోకి ● పోటీ పరీక్షలు, పేపర్ లీకులపై చర్చలు ● సోషల్ మీడియాలో ప్రశ్నలు, రీల్స్‌తో యువతకు చేరువ

మిగతాది 2లో

## హర్మూజ్ జలసంధిలో భారత నావికుల నౌకపై ఇరాన్ దాడి..



2

● పనామా జెండా నౌకపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ రాకెట్ లాంచర్‌తో దాడి ● దాడి సమయంలో నౌకలో 21 మంది భారత సిబ్బంది ఉన్నట్లు నిర్ధారణ ● ఇప్పటివరకు జరిగిన దాడుల్లో 15

# యువతే టార్గెట్.. రాహుల్ గాంధీ రాజకీయ వ్యూహంలో కొత్త మార్పు!

పెద్ద సభలు.. భారీ ప్రసంగాలు.. రాజకీయ నినాదాలు. ఇలాంటి సంప్రదాయ ప్రచారానికి భిన్నంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పుడు యువతతో నేరుగా మాట్లాడుతున్నారు. ముఖ్యంగా జనరేషన్-జెడ్ (జెన్-జీ), యువతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో ముఖాముఖి చర్చిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగానూ అదే తరహా సంభాషణకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

### విద్యార్థుల సమస్యల నుంచి..

యువతను చేరుకునే ఈ ప్రయత్నం 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంతో మరింత ఊపందుకుంది. పోటీ పరీక్షల ఒత్తిడి, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలో జాప్యం వంటి సమస్యలపై ఇందులో చర్చలు జరిగాయి. కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్ వంటి కేంద్రాల్లో మొదలైన ఈ కార్యక్రమం క్రమంగా విస్తరించింది.

### యువతులపై ప్రత్యేక దృష్టి

ఇటీవల పూణెలో జరిగిన కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ యువతుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. కెరీర్‌లో ఎదురయ్యే అడ్డంకులు, భద్రత, ఉద్యోగ ప్రదేశాల్లో పరిస్థితులు, కుటుంబం, సమాజం విధించే ఆంక్షలపై వారితో మాట్లాడారు.



సమాజం తమను ఎలా చూస్తోంది? భయాన్ని ఎలా ఉపయోగిస్తున్నారు? ఎలాంటి హింసను ఎదుర్కొంటున్నారు? అది ఎక్కడ జరుగుతోంది? వంటి అంశాలపై యువతులు తమ అనుభవాలను పంచుకోవాలని రాహుల్ కోరారు.

### వ్యక్తిగత అనుభవాలే చర్చకు బాట

మహిళా సహచరులు పంచుకున్న వ్యక్తిగత అనుభవాలను కూడా రాహుల్ గాంధీ చర్చకు తీసుకొచ్చారు. శ్రద్ధ పేరుతో నియంత్రణ, చిన్న వయసులో పెళ్లి, పితృస్వామ్య భావజాలం, నైతిక పోలిసింగ్, భద్రత, వైద్య సదుపాయాల కొరత, వ్యక్తిగత నిర్ణయాలపై ఆంక్షల వంటి అంశాలు చర్చకు వచ్చాయి.

### సోషల్ మీడియాలో కొత్త పంథా

డిజిటల్ వేదికల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రశ్నలు-సమాధానాలు, రీల్స్ వంటి సులభమైన ఫార్మాట్లతో యువతను చేరుకుంటున్నారు. గిగ్ ఎకానమీలో ఉద్యోగ భద్రత, మానసిక ఆరోగ్యం వంటి ఆధునిక సమస్యలపై మాట్లాడుతున్నారు. రాహుల్ గాంధీ వ్యూహంలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అన్నారు. భారీ ప్రసంగాల నుంచి నేరుగా సంభాషణ వైపు ఆయన అడుగులు వేస్తున్నారు. యువత ఏం ఆలోచిస్తోంది? ఏ సమస్యలను ఎదుర్కొంటోంది? తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ సంభాషణను ఏకపక్ష ప్రసంగం నుంచి రెండు వైపుల చర్చగా మార్చడమే ఈ వ్యూహం లక్ష్యంగా కనిపిస్తోంది.

---

# ఎన్‌హెచ్‌ఏఐ కీలక నిర్ణయం..

ఈ డిజిటల్ పాస్ విధానం పూర్తిగా ఆన్‌లైన్‌మయం



కావడంతో స్థానికులకు ప్రక్రియ మరింత సులభతరం కానుంది. వాణిజ్యేతర వాహనాలు కలిగిన అర్హులైన వినియోగదారులు 'రాజమార్గయాత్ర' మొబైల్ యాప్ ద్వారా ఈ పాస్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుడి నివాస చిరునామా, వాహన వివరాలు, ఫాస్టాగ్ వంటివి డిజీలాకర్, వాహన్ (వాహనాచీ) పోర్టల్స్ ద్వారా డిజిటల్‌గానే ధ్రువీకరించుకుంటారు. దీంతో గతంలోలాగా పత్రాలను తీసుకుని టోల్‌ప్లాజా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం చాలా వరకు తప్పుతుంది. ఈ పాస్ నేరుగా వాహనం ఫాస్టాగ్‌కు అనుసంధానం చేయబడుతుంది. భవిష్యత్తులో బ్యారియర్-రహిత (మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో) టోలింగ్ వ్యవస్థను అమలు చేసే దిశగా ఎన్‌హెచ్‌ఏఐ తీసుకుంటున్న చర్యల్లో ఈ డిజిటల్ పాస్ ఒక కీలక ముందడుగు. కొత్త ఆటోమేటెడ్ వ్యవస్థలో సరైన లోకల్ పాస్ లేని స్థానిక వాహనదారులకు టోల్ చెల్లించనందుకు ఈ-నోటీసులు జారీ అయ్యే ప్రమాదం ఉంది. ఈ సమస్యను నివారించేందుకే ఈ డిజిటల్ పాస్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. దేశంలో మొట్టమొదటి డిజిటల్ లోకల్ పాస్‌ను గత నెలలో ఢిల్లీలోని ముండ్కా-బక్కర్‌వాలా టోల్‌ప్లాజా వద్ద ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సౌకర్యం అందుబాటులో ఉన్న 121 టోల్‌ప్లాజాల పూర్తి జాబితా 'రాజమార్గయాత్ర' యాప్‌లో అందుబాటులో ఉంది. టోల్‌ప్లాజాకు 20 కి.మీ. పరిధి అవతల నివసించే వారు లేదా ఈ జాబితాలో లేని ప్లాజాల వద్ద పాత పద్ధతిలోనే నేరుగా టోల్‌ప్లాజా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కాగా, ఈ రూ.350 లోకల్ పాస్ అనేది ఎన్‌హెచ్‌ఏఐ అందించే రూ.3,075 (2026-27 సంవత్సరానికి) వార్షిక పాస్‌కు పూర్తిగా భిన్నమైనదని అధికారులు స్పష్టం చేశారు.

# టీసీఎస్ ఉద్యోగులపై ఎలాంటి నిఘా లేదు..

దేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), తమ ఉద్యోగులపై నిఘా పెడుతోందంటూ వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించింది. కంపెనీ అందించిన ల్యాప్‌టాప్‌ల ద్వారా ఉద్యోగుల వ్యక్తిగత కార్యకలాపాలను ట్రాక్ చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని స్పష్టం చేసింది. తాము ఉపయోగిస్తున్న టూల్స్ కేవలం నెట్‌వర్క్ పనితీరును స్థూల స్థాయిలో (మ్యాక్రో-లెవల్) పర్యవేక్షించేందుకేనని, వ్యక్తిగత నిఘా కోసం కాదని స్పష్టం చేసింది. ఈ అంశంపై టీసీఎస్ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. "ఉద్యోగులపై నిఘాకు సంబంధించి వస్తున్న కథనాలు నిరాధారమైనవి, అవాస్తవమైనవి. టీసీఎస్ ఎప్పుడూ ల్యాప్‌టాప్‌లలో ఉద్యోగుల వ్యక్తిగత కార్యకలాపాలను ట్రాక్ చేయదు. వారి గోప్యతకు మేము అత్యంత గౌరవం ఇస్తాము. మా ఉద్యోగులకు మెరుగైన భద్రత, లభ్యత, యూజర్ అనుభవాన్ని అందించే లక్ష్యంతోనే నెట్‌వర్క్ పనితీరును పర్యవేక్షించడానికి కొన్ని టూల్స్‌ను ఉపయోగిస్తున్నాం" అని ఆ ప్రకటనలో వివరించింది. టీసీఎస్ తమ ఉద్యోగుల కోసం 'డిజిటల్ యూజర్ ఎక్స్‌పీరియన్స్ మానిటరింగ్' అనే టూల్‌ను ఉపయోగిస్తోందని, దీని ద్వారా వారు ఏయే అప్లికేషన్లు వాడుతున్నారు, వాటిపై ఎంత సమయం గడుపుతున్నారు వంటి వివరాలను సేకరిస్తోందని ఇటీవల కొన్ని మీడియా కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే టీసీఎస్ ఈ వివరణ ఇచ్చింది. వాస్తవానికి ఐటీ రంగంలో సైబర్ సెక్యూరిటీ, డివైజ్ మేనేజ్‌మెంట్, సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం ఇలాంటి టూల్స్‌ను ఉపయోగించడం సాధారణమే. అయితే, సేకరించిన డేటాను నెట్‌వర్క్ పనితీరు విశ్లేషణకు వాడుతున్నారా? లేక ఉద్యోగుల పనితీరును అంచనా వేయడానికి వ్యక్తిగతంగా పరిశీలిస్తున్నారా? అనే దానిపైనే ప్రధాన వ్యత్యాసం ఆధారపడి ఉంటుంది. దాదాపు 6 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్న టీసీఎస్, తాము కేవలం నెట్‌వర్క్ మొత్తం పనితీరుపైనే దృష్టి పెడతామని, వ్యక్తిగత కార్యకలాపాల ట్రాకింగ్‌పై కాదని స్పష్టం చేసింది. ఐటీ కంపెనీలలో వర్క్‌ప్లేస్ మానిటరింగ్‌పై విస్తృతంగా చర్చ జరుగుతున్న తరుణంలో టీసీఎస్ ఈ క్లారిటీ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అవినాశ్ రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ తనిఖీలు

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డితో పాటు మరికొందరి నివాసాలు, కార్యాలయాలపై శుక్రవారం ఈడీ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయ అధికారులు మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈ తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్, కడప జిల్లా పులివెందులలో కలిపి మొత్తం ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. హైదరాబాద్‌లోని కోకాపేటలో ఉన్న అవినాశ్ రెడ్డి విల్లా, పులివెందులలోని ఆయన నివాసంతో పాటు, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డికి చెందిన పులివెందుల భాకరాపురంలోని ఇంట్లోనూ అధికారులు తనిఖీలు చేశారు. మొదట భాస్కర్ రెడ్డి ఇల్లు తాళం వేసి ఉండటంతో, బంధువులను పిలిపించి దానిని తెరిపించారు. వీరితో పాటు సీబీఐ చార్జ్‌షీట్‌లో పేర్లు ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, యెర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, షేక్ దస్తగిరి నివాసాల్లో కూడా ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల సందర్భంగా పలు కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

కేసు నేపథ్యం

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ కు బాబాయి అయిన వైఎస్ వివేకానంద రెడ్డి, 2019 మార్చి 15న పులివెందులలోని తన నివాసంలో హత్యకు గురయ్యారు. ఈ కేసును మొదట రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేయగా, 2020 మార్చిలో ఏపీ హైకోర్టు ఆదేశాలతో సీబీఐకి బదిలీ అయింది. ఈ హత్య వెనుక రూ. 40 కోట్ల సుపారీ కుట్ర ఉన్నట్లు అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్ల ఆధారంగా, ఈడీ మనీ లాండరింగ్ కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. హత్యకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపుపైనే ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. తాజా సోదాలు ఈ దర్యాప్తులో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# ఏపీ ఎంపీ కుమారుడి యాక్సిడెంట్ కేసు: అరెస్ట్

మాదాపూర్‌లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం కేసులో జనసేన ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడు లింగమనేని సంజూష్ (21)ను ఇంకా అరెస్టు చేయకపోవడంపై సైబరాబాద్ పోలీసులు వివరణ ఇచ్చారు. తాము నిబంధనల ప్రకారమే వ్యవహరించామని, ఈ విషయంలో ఎవరి పలుకుబడికి లొంగలేదని వారు స్పష్టం చేశారు. ఆగస్టు 16న మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో రోడ్డు దాటుతున్న భారతి ముఖి (26) అనే యువతిని సంజూష్ నడుపుతున్న ఆస్టన్ మార్టిన్ కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతురాలు భారతి ఒక లైఫ్‌స్టైల్ స్టోర్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 106(1) (నిర్లక్ష్యం కారణంగా మరణం సంభవించడం) కింద కేసు నమోదు చేశారు.

ఈ కేసులో గరిష్ఠ శిక్ష ఐదేళ్లు మాత్రమేనని, ఏడేళ్లలోపు శిక్ష పడే నేరాల్లో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదని సైబరాబాద్ డీసీపీ రితిరాజ్ తెలిపారు. సుప్రీంకోర్టు "అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్" కేసులో ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 35 కింద నిందితుడికి నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. దర్యాప్తునకు సహకరించాలని ఆ నోటీసులో పేర్కొన్నట్లు వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే సంజూష్‌ను అదుపులోకి తీసుకుని ఆల్కహాల్, డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా ఫలితాలు నెగటివ్‌గా వచ్చాయని, తదుపరి



నిర్ధారణ కోసం రక్త నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిందితుడి రాజకీయ నేపథ్యం కారణంగానే పోలీసులు అరెస్ట్ చేయలేదని వస్తున్న ఆరోపణలను పోలీసులు ఖండించారు. అవి కేవలం నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, ఫోరెన్సిక్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నివేదికలు అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనల మేరకు అవసరమైతే అరెస్ట్ చేసే అంశాన్ని పరిశీలిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## హర్మూజ్ జలసంధిలో భారత నావికుల నౌకపై ఇరాన్ దాడి..

(మొదటి పేజీ తరువాయి)

హర్మూజ్ జలసంధిలో భారత నావికులు ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితులను కళ్లకు కడుతూ ఓ పాత వీడియో ఇప్పుడు మళ్లీ వెలుగులోకి వచ్చింది. 2026 ఏప్రిల్ 22న జరిగిన ఈ ఘటనలో, 21 మంది భారత సిబ్బందితో ప్రయాణిస్తున్న పనామా జెండాతో కూడిన 'యూఫోరియా' అనే కంటైనర్ నౌకపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దళాలు దాడి చేశాయి. ఈ వీడియోలో, ఐఆర్‌జీసీకి చెందిన చిన్న పడవలు సరుకు రవాణా నౌకను చుట్టుముట్టడం, రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్‌తో దాడి చేయడం వంటి దృశ్యాలు రికార్డయ్యాయి. దాడి తీవ్రమవడంతో, ప్రాణభయంతో భారత నావికులు నౌకలోని సన్నని మార్గాల్లో (అల్లేవేస్) తలదాచుకోవడం కనిపించింది. ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఈ ఫుటేజీని విడుదల చేస్తూ "దాడి చేసింది సముద్రపు దొంగలు కాదు, ఐఆర్‌జీసీకి చెందిన నౌకాదళ బలగాలు" అని స్పష్టం చేసింది. అదృష్టవశాత్తూ, ఈ ఘటనలో సిబ్బంది ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని, వారంతా సురక్షితంగా ఉన్నారని భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ఆ తర్వాత ధ్రువీకరించింది. 2026 ఫిబ్రవరిలో ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ వివాదం మొదలైనప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఈ నౌకాయాన మార్గంలో ఇటు ఇరాన్, అటు అమెరికా బలగాలు వాణిజ్య నౌకలపై తరచూ దాడులకు పాల్పడుతున్నాయి. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం, ఈ ఘర్షణలు మొదలైనప్పటి నుంచి జరిగిన దాడుల్లో సుమారు 15 మంది నావికులు ప్రాణాలు కోల్పోగా, వీరిలో చాలామంది భారతీయులే ఉన్నారు. ప్రపంచ నావికుల్లో 12 శాతం మంది భారతీయులే ఉన్న నేపథ్యంలో, వారి భద్రతపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఇరాన్, అమెరికాల వద్ద తన నిరసనను వ్యక్తం చేసింది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ పాత వీడియో, ఆ ప్రాంతంలో భారత నావికులు ఎదుర్కొంటున్న ముప్పును మరోసారి గుర్తుచేస్తోంది.

## కొండా ఫ్యామిలీపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా సమావేశమై చర్చించారు. అనంతరం కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను టార్గెట్ చేస్తూ కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆమె వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా సురేఖకు వ్యతిరేకంగా గళం విప్పారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు మీడియా సమావేశంలో మాట్లాడారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని ఎమ్మెల్యేలు తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలపై బాధ్యత వహించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. సీఎంను వ్యతిరేకించే వారికి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. మీ భాష ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగించేలా ఉందని కొండా ఫ్యామిలీని ఉద్దేశించి అన్నారు. సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడంపైనా ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇచ్చిన వివరణ తమకు ఆమోదయోగ్యంగా లేదని తేల్చారు. సీఎం రేవంత్ ఎంతో కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శించినప్పుడు ఖండించడం కనీస బాధ్యత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చాలనే ప్రతిపక్షాల కుట్రలకు బలం చేకూర్చుతున్నారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరారు.

## టాలీవుడ్‌లో విషాదం..

## దిగ్గజ నటి షావుకారు జానకి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఆమె సుదీర్ఘ సినీ ప్రయాణం సాగింది. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరతో పాటు బుల్లితెరపైనా నటించారు. ఇటీవల కూడా తెలుగు సినిమాల్లో కనిపించారు. ఆమె చివరిసారిగా 2023లో విడుదలైన 'అన్నీ మంచి శకునములే' చిత్రంలో నటించారు. మొత్తంగా షావుకారు జానకి 450కు పైగా సినిమాల్లో నటించారు. నాలుగు తరాల నటీనటులతో కలిసి పనిచేసిన ఘనత ఆమె సొంతం. ఎంజీఆర్, జయలలిత, ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శివాజీ గణేశన్, రాజ్‌కుమార్ వంటి దగ్గజాలతో స్క్రీన్ చేసుకున్న నటిగా ఆమె రికార్డు సృష్టించారు. సినీ రంగానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2022లో ఆమెకు పద్మశ్రీ పురస్కారం అందించింది. దశాబ్దాల పాటు సాగిన ఆమె నటనా ప్రస్థానం తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోతుంది.

## ఆయుర్వేద చికిత్స కోసం నేడు కేరళకు పవన్

(మొదటి పేజీ తరువాయి)

అయితే, పరిపాలనా బాధ్యతల దృష్ట్యా పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స జరిగిన వారంలోపే తిరిగి విధుల్లో చేరారు. ముందస్తుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను ఆయన నిర్వహించారు. విశ్రాంతి లేకుండా విధుల్లో పాల్గొనడం వల్ల ఆయన భుజానికి వాపు రావడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ నేపథ్యంలో, భుజం నొప్పి నుంచి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి కేరళలో ప్రత్యేక ఆయుర్వేద చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించగా, ఆయన రేపు అక్కడకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## రేవంత్ అమెరికా టూర్‌కు నో.. కారణం ఇదే!

(మొదటి పేజీ తరువాయి)

ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు వారి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని జైస్వాల్ చెప్పారు. సంబంధిత పదవికి, పర్యటన ఉద్దేశానికి తగినట్లుగా కార్యక్రమం ఉండాలని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణానికి అనుగుణంగా కార్యక్రమం లేదని, అందుకే రాజకీయ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. బ్రిటన్ పర్యటనకు మాత్రం అనుమతి ఇచ్చినట్లు గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి ఆగస్టు 30న హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. అయితే అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో ఆయన ముందే హైదరాబాద్ చేరుకోనున్నారు. అమెరికా పర్యటనలో ఆయన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి పెట్టుబడిదారులను కలవాల్సి ఉన్నట్లు తెలంగాణ సీఎంవో వెల్లడించింది. ఈ పర్యటనకు రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించడంతో పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని తెలిపింది.

## భూముల వేలంపై సుప్రీం కీలక తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) రాయదుర్గం పాన్ మక్తాలోని సుమారు 11 ఎకరాల భూమిని వేలం వేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎకరాకు కనీస ధరను రూ.175 కోట్లుగా నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జువ్వాడి ప్రణయ సింహారావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ, గతంలో కంచ గచ్చిబౌలిలోని భూముల వేలాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసిందని, ప్రస్తుతం ప్రభుత్వం అవే రక్షిత భూములను వేలం వేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన వాదించారు. ప్రస్తుతం వేలానికి ఉంచిన రాయదుర్గం భూములకు, గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ రెండు ప్రాంతాల మధ్య దాదాపు 5 కిలోమీటర్ల దూరం ఉందన్న విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాయదుర్గం భూముల వేలం ప్రక్రియకు మార్గం సుగమమైంది.

## నంద్యాలలో ఆయుష్ మెడికల్ క్యాంప్ విజయవంతం.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ మస్జిద్, నంద్యాలలో నిర్వహించిన ఆయుష్ మెడికల్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో ప్రముఖ యునానీ వైద్య నిపుణులు డా. షేక్ మహమ్మద్ యునానీ (బి యు ఎం ఎస్) ఆధ్వర్యంలో వందలాది మంది రోగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన యునానీ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరానికి పురుషులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య బృందానికి, ఆయుష్ శాఖ సిబ్బందికి, సేవలందించిన వాలంటీర్లకు మరియు సహకరించిన ప్రజలందరికీ బస్టాండ్ మస్జిద్ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్తూరు దేవస్థానం నందు
## కనుల పండుగగా వరలక్ష్మీ వ్రతం..

పాణ్యం ఆగస్టు 21 పల్లె వెలుగు : మండలం సమీపంలోని ఎస్ కొత్తూరు గ్రామంలో





వెలసిన ప్రముఖ శైవ క్షేత్రం శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు వరలక్ష్మి వ్రతం శుక్రవారం కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు నారాయణ స్వామి,సురేష్ స్వామి, రోహిత్ స్వామి ముందుగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి అభిషేకములు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ మండపం నందు వరలక్ష్మి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహిళా భక్తులచే అంగరంగ వైభవంగా శ్రీ వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. పూజకు హాజరైన మహిళా భక్తులకు దేవస్థానం తరపున ఉచితంగా పూజా సామాగ్రిని అందజేశారు.వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన వితరణ చేశారు.

## మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ మారెడ్డి రామయ్య ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 21: శ్రీశైలం నియోజకవర్గంలో మెగా యూత్ ఫోర్సు





కన్వీనర్ మారెడ్డి రామయ్య ఆధ్వర్యంలో పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన మూడు రోజుల వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు శ్రీశైలం నియోజకవర్గం లోని బండి ఆత్మకూరు,వెలుగోడు మండలాల్లోని పలు గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు.మెగా స్టార్ చిరంజీవి ఆయురారోగ్యాలతో ఉండాలని పెద్ద దేవళాపురంలోని ఏకశిల అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజాలను నిర్వహించారు.వెలుగోడు లోని సర్వజన ఆసుపత్రిలో గర్భిణీ మహిళలకు, రోగులకు బెడ్లు ,పండ్లు పంపిణీ చేశారు.బి కోడూరు గ్రామంలోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీశైలం నియోజకవర్గం మెగా యూత్ ఫోర్స్ కో కన్వీనర్ బండపల్లి సురేష్,మెగా యూత్ ఫోర్స్ స్పోక్ పర్సన్ పసుపుల రాజేష్ యాదవ్,సహాయ సహకారాలతో కార్యక్రమాలు జరిగాయని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఎగ్జిక్యూటివ్ మెంబర్ మల్లేష్ యాదవ్, కుమార్ , సిద్ధు,పెద్దదేవలాపురం నాయకులు జయన్న, రాజు ,మస్తాన్ వలి, వలి బాషా, వీర మహిళ ప్రవల్లిక, మహాలక్ష్మి, సరస్వతి,రామారావు, ఈశ్వర్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి స్థానిక సంస్థల
# ఎన్నికలకు వెళ్లాలి సిపిఐ.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని నంద్యాల సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి జి లక్ష్మీదేవి, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు డి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్, సిపిఐ నాయకులు సరోజమ్మ, ఖలీల్, శారద, డిమాండ్ చేశారు .




అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ మేము అధికారంలోకి వస్తే ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలం గ్రామాలలో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని ఇంతవరకు నెరవేర్చలేదు అని తెలిపారు. అదేవిధంగా మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని వృద్ధాప్య వితంతు వికలాంగుల తదితర పింఛన్లు ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదని , అమ్మఒడి పథకం గ్యాస్ సిలిండర్లు కొంతమందికే పడుచున్నది అసలైన బాధితులు మాకు రాలేదని ఆవేదన చెందుతున్నారు .నంద్యాల పట్టణంలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి దాదాపు నాలుగు వేల మందితో సచివాలయాలలో ఎమ్మార్వో కార్యాలయం లో ఇంటి స్థలాల వ్యక్తిగత అర్జీలను ఇప్పించడం జరిగిందని , ఇంతవరకు నంద్యాలలో అధికారులు ల్యాండ్ కూడా చూడలేదని తెలిపారు. నంద్యాల పట్టణంలోని శివారు ప్రాంతాలలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, వంటి మౌలిక వసతులు లేక చిన్నపాటి వర్షానికి వర్షపు నీటిలో విషపురుగులతో జీవిస్తున్నారు. సమ్ ఏరియాలలో దోమలతో విష జ్వరాలతో కూలి నాలి చేసుకునే పేదలు అంటూ రోగాలతో బాధపడుతున్నారు. పట్టణములోని అన్ని వార్డులలో అనేక సమస్యలు వీధి కుక్కలు, పిచ్చికుక్కల వీరవిహారం ఇలా అనేక సమస్యలు తాండవిస్తున్నాయి అని తెలిపారు. ఇవేమీ పట్టించుకోకుండా వార్డ్ కౌన్సిలర్ ఎన్నికలకు పోతే అక్కడి ప్రజలు మిమ్మల్ని తిరస్కరిస్తారని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితిగా తెలియజేశారు.

## మహానంది క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతం

☛ వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు

**మహానంది, పల్లె వెలుగు**

మహానంది పుణ్యక్షేత్రంలో సాముహిక వరలక్ష్మీ



వ్రతాలు ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకొని వందలాది మంది మహిళల చేత సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఆలయం నుంచి అమ్మవారిని ఉత్సవంగా తీసుకొచ్చి అభిషేక మండపంలో కొలువు తీర్చారు. అనంతరం వేద పండితులు రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, శాంతరాం భట్, ప్రధాన అర్చకులు అర్జున శర్మలు వేదమంత్రాలతో నేటి ఉభయ దాతలైన నంద్యాల అవ్వారు గౌరీనాథ్,సరస్వతి దంపతులచే గణపతి పూజ, పుణ్యాహవాచనం,వరలక్ష్మీ కలశ ప్రతిష్ఠా,అథాంగపూజ, తోరపూజలు నిర్వహించి, సామూహిక వరలక్ష్మి వ్రతాలను అత్యంత వైభవంగా







నిర్వహించారు.మహిళలు ఒకరికొకరు తోరమును కట్టుకున్నారు. కథ శ్రావణం భక్తులకు వినిపించారు. అనంతరం ఆలయంలోని పుష్కరిణిలో పూజా వస్తువులకు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలందరికీ దాతలు వాయినాలు సమర్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ, భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మహానంది తహసిల్దార్ రమాదేవి,ఆలయ ఏఈవో మధు, పర్యవేక్షకులు సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**భక్తులకు ప్రసాదం, భోజన వసతి కల్పించిన దేవస్థానం**

## బీసీ వర్గాల చైతన్య శక్తి కుమ్మర కుల ఐక్యతా వాది మొగిలిచర్ల వీరన్న

పల్లె వెలుగు:బీసీ వర్గాల రాజ్యాధికార సాధనకు బీసీ ల సాధికారతకు చైతన్యానికి నిరంతరం కృషి




చేసిన గొప్ప బీసీ ఉద్యమకారుడు కుమ్మర కుల ఐక్యతా వాది
కీర్తి శే మొగిలిచర్ల వీరన్న అని తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ లీగల్ అడ్వైసర్ హైకోర్టు సీనియర్ న్యాయవాది మలికంటి వెంకన్న అన్నారు.హైదరాబాద్లోని తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర కార్యాలయంలో కీర్తి శే మొగిలిచర్ల వీరన్న మాజీ అధ్యక్షులు తెలంగాణ కుమ్మర సంఘం 880/2014. లివీరన్న
6 వ వర్ధంతి వేడుకలు తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ అధ్యక్షులు నేదునూరి కనకయ్య అధ్యక్షతన జరిగాయి.కీర్తి శే మొగిలిచర్ల వీరన్న కుమ్మర సామాజిక వర్గం సాధికారిత రాజ్యాధికారంలో కుమ్మర కులస్తుల పాత్ర అనే అంశంపై సదస్సునును నిర్వహించారు.సదస్సుకు అధ్యక్షత వహించిన నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ కుమ్మర సంఘం880/2014 మాట్లాడుతూ కుమ్మర్ల ఐక్యత సంక్షేమమే లక్ష్యంగా స్వాతంత్ర అనంతరం మొదటి సారి కుమ్మర కుల వృత్తిదారుల ఆర్థిక వికాసం కోసం సబ్సిడీ రుణాలు కుమ్మర శాలివాహన ఫెడరేషన్ సాధించిన ఘనత మొగిలిచర్ల వీరన్నదే అని వీరన్న కుమ్మర హక్కుల రక్షణకు చేసిన పోరాటాలు రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్ర ద్వారా కుమ్మర సామాజిక వర్గంలో ఐక్యత చైతన్యం రగిలించారని కుల ఆత్మగౌరవ బావుటాను ఎగిరేసిన గొప్ప నాయకుడు. కుమ్మర సామాజిక వర్గం హక్కుల రక్షనే లక్ష్యంగా కులస్తుల చైతన్య సామాజిక సేవలో నిరంతరం జీవించి తమ జీవితాన్ని కుమ్మర కులస్తుల సామాజిక ఆర్థిక రాజకీయ వికాసం అంకితం చేసిన గొప్ప సామాజిక సంస్కరణ వాది మొగిలిచర్ల వీరన్న అని కొనియాడారు.తెలంగాణ కుమ్మర సంఘం 880/2014రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కుమ్మర ఆత్మగౌరవ భవన్ ఉపాధ్యక్షులు కొల్లూరు అనిల్ కుమార్ మాట్లాడుతూ బీసీ బహుజన వర్గాల సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన ఉద్యమకారుడు వీరన్న అని కుమ్మర కుంటల జివో అమలుకు కుంటలు కబ్జాలకు గురైనపుడువీరన్న నిర్హారదీక్ష చేసి కుమ్మరి మట్టి లభించే కుంటల మీద హక్కులను రక్షించారు అని గుర్తు చేశారు.మొగిలిచర్ల వీరన్న
భౌతికంగా లేకపోయినా వారి ఆశయాలు సాధనకు కుమ్మర సమాజం ఉద్యమించాలి అన్నారు.వీరన్న వర్ధంతి సందర్భంగా
సమావేశం స్వర్గీయ మొగిలి చర్ల వీరన్న ఆశయాల సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి అని
రెండు నిమిషాలు సంతాపాన్ని
ప్రకటించింది.కుమ్మర సంఘ నాయకులు బీసీ ఉద్యమకారులు రాజ్యాధికార సాధనకు సంసిద్ధం కావాలని ప్రతిజ్ఞ చేశారు.కీర్తిశేషులు వీరన్న జ్ఞాపకార్థం సమావేశంలో సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.సమావేశములో తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు కోశాది కారి కార్యదర్శులు మలికంటి సిద్ధయ్య
ధరినిధర్ శ్యాంసుందర్ నమిలకొండ ప్రభాకర్ నాంపల్లి శంకర్ మేధావుల విభాగం కన్వీనర్ డాక్టర్ వారసవేని పరశురామ్ఉద్యోగుల విభాగం కన్వీనర్ ఏం కుమార్ యువత విభాగం అధికారులు కాళ్ళులరం కృష్ణ
ఉపాధ్యక్షులుకాలులారం శంకర్
తదితరులు హాజరై మొగిలిచర్ల వీరన్న కు ఘనంగా నివాళులు
సమర్పించారు.

# రైతన్నలపై కూటమి ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం.



## సాగు, తాగునీరు విడుదల చేయకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తాం.

**● మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి హెచ్చరిక.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో రైతాంగం తీవ్ర దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నా కూటమి ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమని వైఎస్సార్సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మండిపడ్డారు. వర్షాలు లేక పంటలు ఎండిపోతుంటే, సాగునీటి కోసం రైతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నంద్యాల వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ....ప్రాజెక్టులలో నీరున్నా కాలువలకు విడుదల ఏదీ? ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 875 అడుగుల వద్ద తగినంత నీటి నిల్వలు ఉన్నప్పటికీ, కాలువలకు లేదా రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం పూర్తి విఫలమైందని విమర్శించారు. ప్రాంతీయ రిజర్వాయర్లలో నీటి మట్టాలు ఆందోళనకరంగా ఉన్నాయని గణాంకాలతో వివరించారు: వెలుగోడు రిజర్వాయర్: 17 టీఎంసీల సామర్థ్యానికి గానూ కేవలం 4 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి.

**గోరుకల్లు రిజర్వాయర్: 12.5 టీఎంసీల సామర్థ్యానికి గానూ 6 టీఎంసీల నీరే అందుబాటులో ఉంది.**

అవుకు రిజర్వాయర్: 4.5 టీఎంసీల సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం కేవలం 1 టీఎంసీ మాత్రమే ఉంది.

**రాయలసీమకు తీరని ద్రోహం...**

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచి రాయలసీమను దశాబ్దాల కరువు నుండి కాపాడారని గుర్తుచేశారు. కానీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసి ప్రాంతానికి తీవ్రద్రోహం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వం 800 అడుగుల నుంచే నీటిని తోడుకుంటున్నా, ఏపీ ప్రభుత్వం మన వాటా నీటిని సరిగ్గా వినియోగించుకోలేకపోతోందన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టిన ప్రతిసారీ రాష్ట్రం తీవ్ర కరువు కాటకాల బారిన పడుతుందని ఎద్దేవా చేశారు. యూరియా కోసం క్యూలైన్లు

**-- రైతులపై కేసులు..**

గత ఏడాది పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల పాలైన రైతులకు, నేడు ఎరువులు, పురుగుమందుల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. యూరియా కోసం ఆన్‌లైన్ అప్లికేషన్లు పెట్టించడం, పంపిణీలో రాజకీయ రంగులు పులమడం సిగ్గుచేటన్నారు. మద్దతు ధర అడిగిన రైతులపై కేసులు పెట్టి జైళ్లకు పంపిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఉద్యమానికి సిద్ధం...**

నంద్యాల అర్బన్, రూరల్ పరిధిలోనే సుమారు 30 వేల ఎకరాల్లో పంటలు సాగు కావలసి ఉందని, వెంటనే నీటిని విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణ తాగునీటి అవసరాలు, మిట్నాల చెరువు నీటి ఎద్దడి తీర్చేందుకు ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళిక ఏంటో స్పష్టం చేయాలన్నారు. తక్షణమే కాలువలకు నీటిని విడుదల చేయకపోతే, రైతులను సమీకరించి స్వయంగా వెళ్లి నీటిని విడుదల చేస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డి, వైసీపీ డోన్ నియోజకవర్గం పరిశీలకుడు దేశం సుధాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాష్ట్ర ఎస్ టి సెల్ సెక్రటరీ శంకర్ నాయక్, మధు మరియు పలువురు రైతు నాయకులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల కమిషన్ పెంచాలి

**-క్వింటాకు రూ.200 చొప్పున ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం**
**-ఏడేళ్లుగా పెరగని కమిషన్.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలోనే అతి తక్కువ**
**-29,796 మంది డీలర్ల కుటుంబాల ఆర్థిక భద్రతను దృష్టిలో పెట్టుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**



విజయవాడ . ఆగస్ట్ 21. (పల్లె వెలుగు ):ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తూ, కోట్లాది మంది కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న రేషన్ డీలర్ల కమిషన్‌ను తక్షణమే పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రేషన్ డీలర్ సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఎండీయూ వ్యవస్థను రద్దు చేసిన సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కమిషన్ పెంపుపై నిర్ణయం తీసుకోవాలని సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.రాష్ట్రంలో సుమారు 29,796 మంది రేషన్ డీలర్లు ప్రజలకు సేవలందిస్తున్నారని రాష్ట్ర అధ్యక్షులు మండాది వెంకటరావు తెలిపారు.ముఖ్యంగా 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు వంటి వారికి నేరుగా వారి ఇళ్ల వద్దకే నిత్యావసర సరుకులు అందించే విధంగా రేషన్ డీలర్లు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి నెలా 20 లక్షలకు పైగా కార్డుదారులకు సరుకుల పంపిణీలో డీలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని వివరించారు.ప్రభుత్వ నిర్ణయాలకు డీలర్ల సహకారంలి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి విధానపరమైన మార్పులు తీసుకొచ్చినా రేషన్ డీలర్లు ప్రభుత్వానికి అండగా నిలిచి, ప్రతి మార్పును స్వాగతిస్తూ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు సహకరిస్తున్నారని మండాది వెంకటరావు తెలిపారు.ప్రజలకు నేరుగా సేవలు అందించే రేషన్ డీలర్లపై పని భారం నిరంతరం పెరుగుతున్నప్పటికీ, గత ఏడు సంవత్సరాలుగా కమిషన్‌లో ఎలాంటి పెంపు జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు, సిబ్బంది వ్యయాలు, రవాణా తదితర భారాలను దృష్టిలో పెట్టుకుని డీలర్ల ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో తక్కువలి

దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ డీలర్లకు ప్రస్తుతం అందుతున్న కమిషన్ చాలా తక్కువగా ఉందని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలోనే డీలర్లకు తక్కువ కమిషన్ లభిస్తోందని తెలిపారు.కర్ణాటకలో క్వింటాకు రూ.150, తెలంగాణలో క్వింటాకు రూ.140 చొప్పున కమిషన్ అందుతున్నట్లు సంఘం ప్రతినిధులు వివరించారు. తమిళనాడులో రేషన్ డీలర్లను కో-ఆపరేటివ్ సొసైటీ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు అందించడంతో పాటు అదనంగా ప్రతి క్వింటాకు రూ.20 కమిషన్ ఇస్తున్నారని తెలిపారు.కేరళలో రేషన్ కార్డుల సంఖ్యను ఆధారంగా చేసుకుని స్లాబ్ విధానాన్ని అమలు చేస్తున్నారని, దీని ద్వారా రేషన్ డీలర్లకు నెలకు సుమారు రూ.18 వేల నుంచి రూ.46 వేల వరకు ఆదాయం వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు.

క్వింటాకు రూ.200కు పెంచాలిలి

ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ డీలర్లపై ఉన్న పని భారం, ప్రజలకు అందిస్తున్న సేవలు, పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను దృష్టిలో పెట్టుకుని క్వింటాకు రూ.200 చొప్పున కమిషన్ పెంచాలని రాష్ట్ర రేషన్ డీలర్ సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని కోరింది.ఎండీయూ వ్యవస్థ రద్దు సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి, వేలాది రేషన్ డీలర్ల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలని సంఘం విజ్ఞప్తి చేసింది. ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్న డీలర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరింది.

**ఏకగ్రీవంగా తీర్మానంలి**

రేషన్ డీలర్ల కమిషన్‌ను క్వింటాకు రూ.200కు పెంచాలని కోరుతూ రాష్ట్ర రేషన్ డీలర్ సంక్షేమ సంఘం 483/18 కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, డీలర్ల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బుగత వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి. చిట్టిరాజు, కోశాధికారి రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎమ్మెల్యే ప్రవీణ్, బి. రవికుమార్, కాటా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు బీజేపీ భరోసా జనతా వారధి,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 21 రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మరియు కర్నూలు






జిల్లా ఇన్చార్జి శ్రీ సంధి రెడ్డి శ్రీనివాసులు గారి ఆదేశాల మేరకు మరియు కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ పరమహంస ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి గురురాజు దేశాయ్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కార్యాలయం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఈరోజు జనతా వారధి కార్యక్రమంలో భాగంగా ప్రజలు నుండి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో అందజేశారు. ప్రజలు అందించిన ప్రతి సమస్యను శ్రద్ధగా స్వీకరించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుంది. ప్రజలు అందించిన అన్ని సమస్యల వినతిపత్రాలను రానున్న సోమవారం రోజు కర్నూలు జిల్లా కలెక్టర్ కి అందజేసి, సమస్యల పరిష్కారం కోసం అధికారులపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**ప్రజల సమస్య మా సమస్య... ప్రజల గొంతుకే బీజేపీ గొంతుక...**

పరిష్కారం సాధించే వరకు ప్రజల వెంట బీజేపీ! ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు బిఎల్ నారాయణ, నందవరం మండలం మాజీ సర్పంచ్ రామన్న గౌడ్, పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సురేంద్ర, ఎమ్మిగనూరు మండలం ప్రధాన కార్యదర్శి విజయ్ మోహన్, నందవరం మండలం బిజెపి సీనియర్ నాయకులు కల్లెల్ శివ, రజక సంఘం నాయకులు నాగరాజు, బిజెపి కార్యకర్తలు రంగన్న, శివ, కాసిం, మిన్నల్లా వివిధ మోర్చాల నాయకులు, కార్యదర్శులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.. అలాగే సోషల్ మీడియా కన్వీనర్ వాల్మీకి దండు వీరేష్ పాల్గొన్నారు

# దళిత సమస్యలపై సామాజిక శంఖారావం,

**☛ఈ నెల 24 న జిల్లా కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి,,,,,,,**

**☛కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు యస్.దేవ సహాయం పిలుపు,,,,,**

ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 21 ఎమ్మిగనూరు టౌన్ స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు కావస్తున్నా దళితులు సామాజికంగా అనేక సమస్యలతో సతమతమవుతున్నారని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక శంఖారావం అధ్యయన యాత్రలో వెలుగులోకి వచ్చాయని వాటి పరిష్కారం కొరకు ఈ నెల 24న సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టినట్లు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) కర్నూలు జిల్లా అధ్యక్షులు యస్.దేవ సహాయం తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కెవిపిఎస్ కార్యాలయంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం పై ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... సామాజిక శంఖారావం అధ్యయన యాత్రలో జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా వెలుగులోకి వచ్చిన సమస్య స్మశాన వాటికలేనని తెలిపారు. ప్రతి గ్రామంలో దళితవాడలో ప్రత్యేక స్మశాన వాటికలు లేకపోవడం, ఉన్న భూములు ఆక్రమణకు గురి కావడం, మౌలిక వసతులు విద్యుత్,మంచినీరు,ప్రహరి గోడలు,స్నానపు గదులు కనీస సౌకర్యాలు లేకపోవడం ఉన్నాయని ఆవేదన చెందారు. జీవో నెంబర్ 1235 ప్రకారం దళితవాడలకు స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా దళితుల భూములకు రక్షణ కల్పించడమే కాకుండా నిరుపేద దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, పక్కా గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని విన్నవించారు. కుల వివక్ష అంటరానితనాన్ని అరికట్టి, విద్య,వైద్యం, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు హాస్టళ్ళు ఏర్పాటు, దళిత కూలీలకు ఉపాధి పై దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కర్నూలు జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి వేలాది మందితో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు




తెలిపారు. కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి దళిత, గిరిజనులు పెద్ద ఎత్తున తరలి రావాలని యస్. దేవ సహాయం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆం.ప్ర. వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సి.గోవిందు, నాగరాజు, కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి సపోగు తిమ్మన్న, కెవిపియస్ ఉపాధ్యక్షులు సుమాల అంతోని తదితరులు పాల్గొన్నారు.

# రైతు పోరుబాటకు శ్రీకారం

## ఎల్ఎల్‌సీ ద్వారా ఖరీఫ్ పంటకు ,,,, నీరు విడుదల చేయాలి,,,,,






- **జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తాం**
- **ఎర్రకోట రాజీవ్ రెడ్డి అల్టిమేటమ్.**

ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 21

ఎమ్మిగనూరు రైతుల సమస్యల పరిష్కారం, ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో పంటలకు అవసరమైన సాగునీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో "రైతు పోరుబాట" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ రైతు మిత్రులు, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

**-ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, కర్నూలు జిల్లా పరిశీలకులు తెర్నికల్ సురేంద్ర రెడ్డి , స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు బి.ఆర్. బసి రెడ్డి హాజరయ్యారు.**

కార్యక్రమంలో భాగంగా తొలుత దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎర్రకోట రాజీవ్ రెడ్డి , పార్టీ నాయకులు, రైతులతో కలిసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ వైయస్సార్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఎల్ఎల్‌సీ కార్యాలయం వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని రైతులకు సాగునీరు విడుదల చేయాలని నినదించారు.

**రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి తెర్నికల్ సురేంద్ర రెడ్డి**

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి, కర్నూలు జిల్లా పరిశీలకులు తెర్నికల్ సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను విస్మరిస్తోందని మండిపడ్డారు. రైతులు ఎంతో కష్టపడి పంటలు సాగు చేసుకున్న సమయంలో వారికి అవసరమైన సాగునీటిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఎల్ఎల్‌సీ ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

**డ్యామ్‌లో నీరు ఉన్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు బి.ఆర్. బసి రెడ్డి**

స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు బి.ఆర్. బసి రెడ్డి మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్‌లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంత రైతులకు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు.

రైతులు ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ ఖర్చుల కోసం పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసుకున్నారని, ఇప్పుడు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ రైతులపై ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కపట ప్రేమ తప్ప నిజమైన చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

**రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది ఎర్రకోట రాజీవ్ రెడ్డి**

అనంతరం ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ "రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది" అని అన్నారు. గ్రామాల్లో రైతు తన పంటలను సుభిక్షంగా పండించుకోవాలంటే సరైన సమయంలో సరైన స్థాయిలో సాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు రైతుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వర్యులు అయిన శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని రాజీవ్ రెడ్డి గుర్తుచేశారు. రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు, పంటల బీమా, పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత వైయస్ జగన్ దేనన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కొనుగోలు--అమ్మకాల ప్రక్రియను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పంటలకు గిట్టుబాటు ధర, పెట్టుబడి సహాయం, పంటల బీమా వంటి అనేక ప్రయోజనాలు కల్పించిన ప్రభుత్వం వైయస్ జగన్ ప్రభుత్వమని తెలిపారు.

**ఖరీఫ్ పంటలకు సాగునీరు విడుదల చేయాలని వినతి**

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని రైతులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజీవ్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి తదితర పంటలు సాగు చేసుకోవడానికి అవసరమైన సాగునీటిని వెంటనే విడుదల చేయాలని రైతులు కోరుతున్నారని పేర్కొన్నారు. తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ రైతులకు అనుకూలంగా సాగునీటిని విడుదల చేయకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. తుంగభద్ర జలాశయంలో ఆంధ్రప్రదేశ్‌కు లభించే వాటా నుంచి ఖరీఫ్ పంటలకు అవసరమైన నీటిని కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు.

రైతులు ఇప్పటికే పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టి విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం ఖర్చు చేశారని, ఈ సమయంలో సాగునీరు అందకపోతే రైతులు పెట్టిన పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పంటలు ఎండిపోతే రైతులు మరింత అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అందువల్ల రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఎల్ఎల్‌సీ కాలువ ద్వారా, అలాగే తుంగభద్ర నది ద్వారా అవసరమైన సాగునీటిని వెంటనే విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని రాజీవ్ రెడ్డి డిమాండ్ చేశారు.

**డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వినతిపత్రం**

రైతుల సాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎర్రకోట రాజీవ్ రెడ్డి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పి.వి.పి. సబ్ డివిజన్, ఎమ్మిగనూరు వారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎమ్మిగనూరు నియోజకవర్గ రైతుల తరఫున అందజేసిన ఈ వినతిపత్రంలో ఖరీఫ్ పంటలకు అవసరమైన సాగునీటిని ఎల్ఎల్‌సీ కాలువ ద్వారా వెంటనే విడుదల చేయాలని, తుంగభద్ర నది ద్వారా కూడా అవసరమైన నీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

*ఇప్పటికే రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, పంటలు సాగు చేసుకున్న సమయంలో అవసరమైన నీరు అందకపోతే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతుల విజ్ఞప్తిని ప్రభుత్వం, సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిగణనలోకి తీసుకొని వెంటనే సాగునీరు విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని కోరారు.*

# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లెలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం ఘనంగా నిర్వహించారు. 2వ శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు నరసింహ మహిళలచె గణపతి పూజ,పుణ్యాహవాచనం, వరలక్ష్మీ కలశ ప్రతిష్ఠా పూజలు నిర్వహించి, సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు అందజేసుకున్నారు.

# జీవామృతాలపై శిక్షణ .



రుద్రవరం.పల్లె వెలుగు : పకృతి వ్యవసాయంలో రైతులు జీవామృతాలపై దృష్టి సారిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఎం సి ఆర్ పి శంకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ బిఆర్సి పాయింట్ సభ్యులకు రెండు రోజులపాటు శిక్షణ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిఆర్సి సభ్యుల బాధ్యతలు విధి విధానాలపై మార్గదర్శకాలతో పాటు జీవామృతాలైన ఘనజీవామృతం, ద్రవ జీవామృతం ,విత్తన గుళికల తయారీ వాటి విధానాలపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. రైతుల జీవనోపాధిని పెంచేందుకు వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని పకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు బిఆర్సి కేంద్రాల సభ్యులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల పరిశీలన.



రుద్రవరం. పల్లె వెలుగు : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో భాగ్యలక్ష్మి పరిశీలించారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండలంలోని 21 గ్రామపంచాయతీలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు ఎంపీడీవో తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సౌకర్యాలు వసతులపై పరిశీలించి పోలింగ్ కేంద్రాల వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. ఎంపీడీవో తో పాటు డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

# ప్రాధాన్యతతో స్వచ్ఛాంధ్ర దినోత్సవం

## జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి ఆదేశాలు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 21: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో శనివారం స్వచ్ఛాంధ్ర దినోత్సవం అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని నంద్యాల,కర్నూలు ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రధాన రహదారులు,వీధులు, సంతలు బస్టాండ్లు,పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో విస్తృత స్థాయిలో పరిశుద్ధ పనులు చేపట్టాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉండి, దోమలు వ్యాప్తి చెందకుండా మురుగు కాలువలు కల్వర్టులు చెరువులు ఇతర జలవనులను క్షుణ్ణంగా శుభ్రపరచాలని పేర్కొన్నారు. చెత్త నిలువ ఉండే ప్రాంతాలను గుర్తించి,ఆ చెత్తను పూర్తిగా తొలగించి ఆ ప్రాంతాలలో పరిశుభ్రమైన పచ్చదనంతో కూడిన ప్రదేశాలుగా మార్చాలని పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించడంతోపాటు, తడి పొడి మరియు గృహ సంబంధిత ప్రమాదకర వ్యర్థాలను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మండలంలోని మెటీరియల్ రికవరీ ఫెసిలిటీస్ ఆర్ ఆర్ ఆర్ కేంద్రాలు, కంపోస్టింగ్ యూనిట్ లో పనితీరును మరింత మెరుగు పరచుకోవాలని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత,ప్లాస్టిక్ నిషేధం పై ర్యాలీలు, మానవహారాలు తదితర వాటిపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. ఈ సదస్సులలో పొదుపు సంఘాల మహిళలు, స్వచ్ఛంద సంస్థలు,యువజన సంఘాలు పాఠశాల విద్యార్థులను భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలు పాఠశాలలు ప్రభుత్వ ఆవరణలు మరియు రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి ప్రాంగణాలను సుందరీకరించాలని పేర్కొన్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు కొలమానాలు, నాణ్యమైన ఫోటోలు, సాసా యాప్ నందు కార్యక్రమం జరిగిన రోజే తప్పనిసరిగా అప్లోడ్ చేసి వీలుగా పంచాయతీ కార్యదర్శులకు సముచిత ఆదేశాలు ఇవ్వవలసినదిగా పేర్కొన్నారు. స్వచ్ఛంద కార్యక్రమం పట్ల విధులలో అలసత్వం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి హెచ్చరించారు.

# ముద్ర లోన్స్ పేరుతో సైబర్ మోసాలు--

## ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.

- **లోన్ మంజూరు చేస్తామని నమ్మించి డబ్బులు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు.**
- **సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.**

పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. ముద్ర లోన్ మంజూరైందని, తక్కువ వడ్డీకే రుణం ఇప్పిస్తామని నమ్మించి సైబర్ నేరగాళ్లు ప్రజలను, రైతులను మోసం చేస్తున్నారని కర్నూలు ఎస్పీ శుక్రవారం తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలను సంప్రదించి, లోన్ ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూ రెన్స్, +ూ, సెక్యూరిటీ డిపాజిట్ తదితర పేర్లతో ముందుగా డబ్బులు చెల్లించాలని కోరుతు న్నారని తెలిపారు. లోన్ వస్తుందనే ఆశతో వారి మాటలు నమ్మి డబ్బులు పంపిన అనంతరం, మరిన్ని డబ్బులు చెల్లించాలని కోరడం లేదా ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం వంటి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొ న్నారు. కర్నూలు ఎస్పీ వారు జిల్లా ప్రజలు రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలువిషయాలు తెలియజేశారు. గుర్తుతెలి యని వ్యక్తులు ఇచ్చే లోన్ ఆఫ ర్లను నమ్మవద్దు. లోన్ కోసం ముందుగా వ్యక్తిగత ఖాతాలకు డబ్బులు పంపవద్దు.ూ, ాూవీ ా×చీ, జుఎ, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దు. అనుమానా స్పద లింకులను క్లిక్ చేయవద్దు.- అధికారిక బ్యాంకులు/ప్రభుత్వ సంస్థల ద్వారా మాత్రమే రుణ వివరాలను నిర్ధారించుకోవాలి. సందే హం వచ్చిన వెంటనే సంబంధిత అధి కారులను లేదా బ్యాంకును సంప్రదిం చాలి. సైబర్ మోసాలకు గురైన వెంట నే1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చ ే య ా ల ని లేదా[illegible] పోర్టల్ లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా దు చేయాలని లేదా జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులను కూడా సంప్రదించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలి పారు. మోసానికి గురైన తర్వాత స్పం దించడం కంటే, ముందుగానే అప్రమ త్తంగా ఉండటం ఎంతో ముఖ్యమని, ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని జాగ్రత్తగా ఉండాలని కర్నూలు ఎస్పీ వారు సూచిం చారు.



### ఆర్ ఏ ఆర్ ఎస్ ను నిర్వీర్యం చేస్తే రైతుల భవిష్యత్తు,

# ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడతాయి

- 125 ఏళ్ల ఆర్.ఏ.ఆర్.ఎస్ చరిత్రను తుడిచేసే కుట్రను సహించం.
- నూనెపల్లె మార్కెట్ యార్డును రాజకీయ ప్రయోజనాలకు మళ్లించొద్దు.
- రైతు భూములపై రాజకీయ కన్ను, రైతుల కడుపు కొట్టి రాజకీయం చేయొద్దు
- నంద్యాలలో అఖిలపక్షం ధ్వజం.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను తక్షణమే తరలించాలని, వ్యవసాయ పరిశోధన కోసం ఏర్పాటు చేసిన అన్ని మౌలిక వసతులను పూర్తిస్థాయిలో ఆర్ ఏ ఆర్ ఎస్ కు అప్పగించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించిన రెండు ఎకరాల భూమిని వెంటనే రద్దు చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేసింది.

అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిన్న మిషన్ కాంపౌండ్ చర్చి సర్కిల్ లో ప్రజా అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఐక్యవేదిక నాయకులు శుక్రవారం నంద్యాల గాంధీచౌక్‌లో పెద్దఎత్తున ప్రజా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, న్యాయవాది శంకరయ్య, ఎస్ డి పి ఐ నాయకులు ఏజెస్ హుస్సేన్, క్రిష్టియన్ జేఏసీ నాయకులు జానయ్య, సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, శివరామిరెడ్డి, మాజీద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి ప్రజలకు కల్పిస్తూ.. "ఇది కేవలం రైతుల సమస్య కాదు.. ప్రతి ఒక్కరి ఆహార భద్రతకు సంబంధించిన అంశం" అన్నారు. రైతుకు లాభం లేకపోతే వ్యవసాయం దెబ్బతింటుందని, వ్యవసాయం దెబ్బతింటే చివరకు ఆహార భద్రతే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.

సుమారు 125 ఏళ్ల చరిత్ర ఉన్న ఆర్ ఏ ఆర్ ఎస్ నంద్యాల ప్రాంత వ్యవసాయ అభివృద్ధికి, అధిక





దిగుబడినిచ్చే విత్తనాల అభివృద్ధికి, విత్తన పరిశ్రమ ఎదుగుదలకు కీలకంగా పనిచేసిందన్నారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిని పెంచేందుకు ఆర్ కె వి వై, నాబార్డ్ నిధులతో నిర్మించిన పరిశోధనా భవనాలు, అడ్వాన్స్‌డ్ సీడ్ లాబరేటరీ ను కలెక్టరేట్ అవసరాలకు వినియోగించడం సరికాదని అన్నారు.

"ఒక సంవత్సరం మాత్రమే తాత్కాలికంగా ఉంటామని చెప్పి తీసుకున్న భవనాలను ఒక్కొక్కటిగా కలెక్టరేట్ పరిధిలోకి తీసుకుంటున్నారు. ప్రజల రాకపోకలతో నిండిపోయిన ప్రాంగణంలో శాస్త్రవేత్తలు ప్రశాంతంగా పరిశోధనలు ఎలా చేస్తారు?" అని ప్రశ్నించారు. అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ..

కలెక్టరేట్‌కు భూమి లేదని ప్రభుత్వం చెబుతున్న సమయంలో నూనెపల్లె మార్కెట్ యార్డులో రాజకీయ పార్టీ కార్యాలయానికి రెండు ఎకరాలు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. కలెక్టరేట్‌కు అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమిని గుర్తించి, పట్టణానికి బయటైనా నిర్మించాలని సూచించారు. ఆర్ ఏ ఆర్ ఎస్ ను బలహీనపరచడం అంటే రైతుల భవిష్యత్తును బలహీనపరచడమేనని, మార్కెట్ యార్డు భూములను రాజకీయ ప్రయోజనాలకు కాకుండా రైతుల ప్రయోజనాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు.

**ప్రజా మద్దతుతో ఉద్యమాన్ని విస్తరిస్తాం**

ఈ కార్యక్రమం మొదటిదేనని, ప్రజల్లో అవగాహన కల్పించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వరకు ఇటువంటి అనేక కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతామని నాయకులు తెలిపారు.

రేపు నూనెపల్లె మార్కెట్ యార్డులో ప్రజలు, రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. ఆగస్టు 24న కలెక్టరేట్ లో జరిగే పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌కు రెండు వేర్వేరు పిటిషన్లు సమర్పించి ఆర్ ఏ ఆర్ ఎస్ నుంచి కలెక్టరేట్‌ను తక్షణమే తరలించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డును రైతుల ప్రయోజనాల కోసం పరిరక్షించాలని డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమం అనంతరం అఖిలపక్ష నాయకులు ఆర్ ఏ ఆర్ ఎస్ విశిష్టత, వ్యవసాయ పరిశోధన ప్రాధాన్యత, ఆర్ ఏ ఆర్ ఎస్ పరిరక్షణ, నూనెపల్లె మార్కెట్ యార్డు పరిరక్షణ అంశాలపై రూపొందించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఆర్ ఏ ఆర్ ఎస్, మార్కెట్ యార్డులను ఎందుకు కాపాడుకోవాలో ప్రజలకు వివరిస్తూ ప్రజా మద్దతును కూడగట్టారు. "ఇది కొంతమంది నాయకుల సమస్య కాదు.. మనందరి బతుకుకు సంబంధించిన సమస్య. ప్రజా ఆస్తులు ప్రజల కోసమే.. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు" అని నాయకులు స్పష్టం చేశారు.

# గూడూరు ఫ్లడ్ జోన్ లో అక్రమ లే అవుట్

- పొంచి ఉన్న పెను ప్రమాదం
- ఏడు శాఖలతో వెంటనే సంయుక్త సమీక్ష సమావేశం నిర్వహించాలి
- ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంట శ్రీనివాసులు రెడ్డి డిమాండ్

(గూడూరు, ఆగస్టు 21, శుక్రవారం) : గూడూరు పట్టణానికి సమీపంలోని తాళమ్మ ఆలయం ఎదురుగా, చల్లకాలువ పరిసర ప్రాంతంలో ఫ్లడ్ జోన్, బఫర్ జోన్లో ఎటువంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండా భారీ స్థాయిలో లే-అవుట్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ లే అవుట్ తో సహజ వరద ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడనుందన్నారు. సుమారు 20--30 అడుగుల మేర భూమిని ఎత్తు పెంచి, గ్రావెల్, మట్టితో చదును చేస్తున్నన్నారని తెలిపారు. సహజ భూమి స్థాయిని మార్చడంతో చల్లకాలువ సహజ వరద ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడి, భారీ వర్షాలు, వరదల సమయంలో పరిసర ప్రాంతాలకు ముంపు ప్రమాదం పెరిగే అవకాశం ఉందన్నారు. 2015 నాటి భారీ వరద అనుభవాన్ని అధికారులు ఒకసారి గుర్తుంచుకోవాల్సి ఉందన్నారు. 2015లో ఈ ప్రాంతంలో సుమారు 2.50 లక్షల క్యూసెక్కుల భారీ వరద ప్రవాహం నమోదైనట్లు అధికారుల గణాంకాలు ఉన్నాయన్నారు. ఇలాంటి వరద ప్రభావిత ప్రాంతంలో భారీగా భూమిని ఎత్తు పెంచి లే అవుట్ అభివృద్ధి చేయడంతో గూడూరు పట్టణంలోని బనికి సాహెబ్ పేట, నరసింగరావు పేట, జనార్దన్ రెడ్డి కాలనీ తదితర లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.



రైల్వే వంతెనలు, రైల్వే ట్రాక్ భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

చల్లకాలువ బ్రిడ్జి వద్ద ఉన్న తొమ్మిది క్లియర్ స్పాన్ల సహజ నీటి ప్రవాహ సామర్థ్యంపై ఈ పనుల ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా రైల్వే ట్రాక్ సమీపంలో భూమి స్థాయిని భారీగా పెంచడం వలన చెన్నై-విజయవాడ రైల్వే మార్గం భద్రతపై ఎలాంటి ప్రభావం పడుతుందో రైల్వే అధికారులు అత్యవసరంగా పరిశీలించాలన్నారు. ఈ అంశాన్ని అత్యవసర ప్రజా భద్రతా సమస్యగా పరిగణించి, కింది శాఖల అధికారులతో వెంటనే సంయుక్త సమీక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ముఖ్యంగా రైల్వే, రెవెన్యూ, ఇరిగేషన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, మున్సిపల్ శాఖ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ, ఎలక్ట్రికల్ శాఖ అధికారులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే సమగ్ర హైడ్రాలజికల్ అధ్యయనం, వరద ప్రవాహ మార్గాల పరిశీలన, రైల్వే భద్రతా అధ్యయనం, సంబంధిత లే-అవుట్ అనుమతుల పరిశీలన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా లే-అవుట్ పనులు జరుగుతున్నట్లు తేలితే, పనులను తక్షణమే నిలిపివేసి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రాణాలు, పట్టణ భద్రత, సహజ వరద ప్రవాహ మార్గాలను కాపాడటానికి అధికారులు ఎటువంటి ఆలస్యం చేయకూడదన్నారు. ఒక లే-అవుట్ కోసం గూడూరు పట్టణ ప్రజల ప్రాణాలతో సహజ వరద ప్రవాహంతో, రైల్వే భద్రతతో చెలగాటం ఆడకూడదన్నారు. ప్రజా భద్రతకు సంబంధించిన ఈ అంశంపై అధికారులు తక్షణమే స్పందించి, శాస్త్రీయంగా సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ విషయమై నెల్లూరు జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, ప్రజా ప్రయోజనాలను కాపాడాలని కోరినట్లు తెలిపారు. అధికారులు స్పందించని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఉద్యమానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

## రేణిగుంట గంగమ్మ జాతరలో గొడవ: 11 మంది అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



విలేకరి (రేణిగుంట, ఆగస్టు 21, శుక్రవారం) : రేణిగుంట పట్టణంలో జరిగిన గంగమ్మ జాతర సందర్భంగా తీవ్ర ఘర్షణకు దిగిన 11 మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. వేణుగోపాలపురం, జ్యోతి నగర్ ప్రాంతాలకు చెందిన పల్లం మదన్, మేకల అశోక్, కె.కార్తీక్, కె.వంశీ, సి.బాలకృష్ణ, ఎన్.విమల్ ఒక వర్గంగా... అలాగే జ్యోతి నగర్‌కు చెందిన ఆర్.చంద్రశేఖర్, ఎ.జస్వంత్, ఆర్.భానుప్రకాష్, ఎ.హేమ కుమార్, ఎ.దిలీప్ మరో వర్గంగా విడిపోయి దాడులు చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదులతో రేణిగుంట కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ జయచంద్ర మాట్లాడుతూ.. ప్రజా శాంతి, భద్రతకు భంగం కలిగిస్తూ బహిరంగ ప్రదేశాల్లో గొడవలు, బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వ్యక్తిగత వివాదాల కోసం చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని సూచించారు. ఇటువంటి ఘటనలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఆటోలపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు.

● 21 ఆటోలు గుర్తింపు జరిమానా ● ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన, కౌన్సెలింగ్ ● నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు -- ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్.






పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ మన్సు రుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు నగరంలోని సి.క్యాంప్ ప్రాంతంలో ఆటో లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 21 ఆటోలను గుర్తించి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరి మానాలు విధించారు. ఆటో డ్రైవ ర్లకు వాహన బీమా, డ్రైవింగ్ లైసెన్స్, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆటో డ్రైవర్లు తప్పనిస రిగా ట్రాఫిక్ నిబం ధనలు పాటిస్తూ, వాహ నానికి సంబం ధించిన అన్ని ధృవపత్రా లను కలిగి ఉండాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## టిడిపి ఎన్నారై నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ పి గురు రాజా ఇండియాకు రాక

- డాక్టర్ గురు రాజాకు స్వాగతం పలికిన
- టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి గోగిశెట్టి నర్సింహారావులి




హైదరాబాద్ బ్యూరో చీఫ్ ఆగస్టు 21 పల్లె వెలుగు టిడిపి ఎన్నారై నేషనల్ కమిటీ చైర్మన్ గా నియమితులై బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటిసారిగా డాక్టర్ గురు రాజా శుక్రవారం నాడు హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ విమానాశ్రయం చేరుకున్న ఆయనకు టిడిపి సీనియర్ మాజీ రాష్ట్ర కార్యదర్శి పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ గోగి శెట్టి నరసింహారావు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపి ఘన స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ గురు రాజాతో కలిసి ఆయన నివాసానికి చేరుకున్నారు. అనంతరం వారు ఇరువురు ప్రస్తుతఏపీ రాష్ట్ర రాజకీయాలు తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.

## ఘనంగా అహోబిలం

## శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయంలో ఉంజల్ సేవ

ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 21 పల్లె వెలుగు ప్రసిద్ధ ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలశీలో శుక్రవారం నాడు వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమృతవల్లి అమ్మవారికి నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. అహోబిలం ఆలయ ప్రధానార్చకులు కీడంబి వేణుగోపాలన్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి ఆలయ ప్రాకారంలో ఉత్సవం అనంతరం రంగ మంటపంలో ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. శ్రావణ శుక్రవారం, వరుస సెలవుల సందర్భంగా ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.





## శ్రావణ శుక్రవారం సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విశేష పూజలు







ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 21 పల్లె వెలుగు శ్రావణ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ హైదరాబాదులోని తమ నివాస గృహంలో వరలక్ష్మి దేవి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆడపడుచులకు తాంబూలాలు అందించి ఆశీస్సులు తీసుకున్నారు. వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆమె కోరుకున్నారు

## విద్యుత్తు వైర్లను ఆవరించిన దట్టమైన పొదులు తొలగింపు

రావికమతం,ఆగస్టు21(పల్లె వెలుగు దినపత్రిక) ప్రతినిధి: మండలంలోని చినపాచీల వైష్ణవి దేవి ఆలయం సమీపంలో విద్యుత్తు స్తంభాలు, వైర్లను ఆవరించిన దట్టమైన పొదులను విద్యుత్తు శాఖ సిబ్బంది శుక్రవారం తొలగించారు. సదరు స్తంభానికి మూడు సర్వీసు వైర్లు ఉండటంతో తరచూ విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయని స్థానికులు విద్యుత్తు శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానికుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన రావికమతం విద్యుత్తు శాఖ సహాయ ఇంజినీర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సిబ్బంది పొదులను



తొలగించే పనులను ముమ్మరం చేశారు. ఎన్నో రోజులుగా దట్టమైన పొదలు స్తంభాన్ని, విద్యుత్తు వైర్లను పూర్తిగా ఆవరించి ఉండటంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. పొదులను పూర్తిగా తొలగించడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం తగ్గడంతో పాటు రహదారిపై ప్రయాణించే వాహనదారులు, స్థానికులకు ప్రమాదం తప్పిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్తు వైర్లకు ఆనుకుని పెరిగే పొదులను ఎప్పటికప్పుడు తొలగించాలని వారు విద్యుత్తు శాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కొమిర సచివాలయ లైన్‌మ్యాన్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం

రావికమతం,ఆగస్టు 21పల్లె వెలుగు ప్రతినిధి: రావికమతం మండలం గుడివాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి చోడవరం శాసనసభ్యులు



కే.ఎస్.ఎన్.ఎస్. రాజు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్. రాజు మాట్లాడుతూ గ్రామస్తులు ఆంజనేయస్వామి మాల ధరించి భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో ఆలయ ప్రారంభోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయ మన్నారు.భక్తిభావంతోగ్రామమంతా ఏకమై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండ నాయుడు, రావికమతం మండల పార్టీ అధ్యక్షులు కోమటి శంకరరావు, పార్టీ నాయకులు మేడిచర్ల నాయుడు, మాజీ ఎంపీటీసీ అప్పలమ్మ, రావికమతం మాజీ సర్పంచ్ గంజి మోది నాయుడు, ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, నాయకులు బాబూరావు, దేములు, కూటమి నాయకులు, గుడివాడ గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జగన్ రెడ్డి పరిజ్ఞానం లేని అస్మర్థుడు ! మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్

అనకాపల్లి, ఆగస్ట్21 పల్లె వెలుగు వైసిపి అధికారంలో జరిగిన గ్రూప్ 1 అతి పెద్ద కుంభకోణం ఊహకందని రీతిలో అక్రమాలకు పాల్పడి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కి మాయని మచ్చ తీసుకొచ్చిన జగన్ రెడ్డి ఏపీపీఎస్సీకి డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీకి తేడా తెలియకుండా ముఖ్యమంత్రి గా వేలగబెట్టిన వైసిపి నాయకులకు శాసనమండలి నేత బొత్స సత్యనారాయణ కు డీఎస్సీ గురించి మాట్లాడే అర్హత లేదని మాజీ




శాసనమండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వర రావు జగన్ రెడ్డి బొత్స లపై విరుచకపడ్డారు. వైసిపి హయాంలో జరిగిన గ్రూప్ 1 సర్వీసు నియామకాలు అతి పెద్ద కుంభకోణం అని, హైకోర్టు నిశిత పర్యవేక్షణ కొనసాగుతున్న, న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే లాగా జగన్ రెడ్డి అఫిడివిట్లు దాఖలు చేస్తూ యదేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారని, యువత జీవితాలతో చెలగాటమాడుతూ జగన్ రెడ్డి గ్యాంగ్ ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారని నాగ జగదీష్ మండిపడ్డారు.

## భక్తులతో పోటెత్తిన అనకాపల్లి శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం

అనకాపల్లి, ఆగస్ట్21 పల్లె వెలుగు పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారి విశేష పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. పవిత్రమైన ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు అమ్మవారిని విశేష రీతిలో నయనానంద కరంగా అలంకరించారు. శ్రావణ వరలక్ష్మీ వ్రతం కావడంతో అనకాపల్లి పట్టణంతో పాటు





చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, మహిళలు తెల్లవారుజాము నుంచే ఆలయానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు ప్రత్యేక క్యూలైన్లు, తీర్థప్రసాదాల ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శులు శ్రీధరాల సోమరాజు, కడిమిశెట్టి అచ్యుతరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వి.వి.ఎస్. మాణిక్యం తో పాటు పాలకమండలి సభ్యులు, పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహకారంతో నే లడ్డు పోటు అన్నప్రసాద భవనాలు నిర్మాణం

విజయవాడ, ఆగస్టు21పల్లె వెలుగు







విజయవాడ(ఇంద్రకీలాద్రి) కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దశాబ్ద కాలం నుంచి ఎదురుచూస్తున్న అన్న ప్రసాద భవనం లడ్డు పోటు భవనాలు ప్రారంభోత్సవం నేడు ఘనంగా జరిగింది ఈ కార్యక్రమాని కి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి, ప్రభుత్వ విప్ ప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు, స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, అమ్మవారి ఆలయ పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ గాంధీ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఈవో శీనా నాయక్ మరియు ఇతర అధికారులు ఆలయ సిబ్బంది తో కలిసి ఎంపి కేశినేని చిన్ని పాల్గొన్నారు. ముందుగా అన్న ప్రసాద భవనాన్ని, తరువాత లడ్డు పోటు భవనాలను ప్రజాప్రతినిధు లు అధికారులు అంతా కలిసి పరిశీలించి అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ ముందుగా శ్రావణ శుక్రవారం రోజున అన్న ప్రసాద భవనం లడ్డు పోటు భవనాలను ప్రారంభించడం శుభ పరిణామం అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం తో ఈ రోజు ఈ రెండు భవనాలు నిర్మాణం చేసుకున్నాం అని ఈరోజు అన్న ప్రసాదం భవనం, లడ్డు పోటు భవనాలు ప్రారంభించు కోవడం జరిగింది అని తెలిపారు సుమారు 53 కోట్ల రూపాయిల నిధులతో ఈరోజు రెండు భవనాలను ప్రారంభించుకున్నామ ని ఈరెండు భవనాలు అమ్మవారి ఆలయానికి ఒక కానుక గా భావిస్తున్నాం అని అన్నారు దేవాదాయ శాఖ మంత్రి అమ్మవారి ఆలయం పై ప్రత్యేక దృష్టి పెట్టారు అని అందుకే ఈ రెండు భవనాల నిర్మాణం ఇంత త్వరితగతిన చేపట్టగలిగామని కూటమి ప్రభుత్వ సహకారంతో చేపట్టిగలిగామని అన్నారు.అమ్మవారి ఆలయం గత 4 నెలలుగా రాష్ట్రం లోని అన్ని దేవాలయాల్లో 1వ స్థానం సాధించింది అని దేవాదాయ శాఖ ఉద్యోగులు అందరు కలిసికట్టుగా పనిచేసారు కాబట్టే సాధ్యపడింది అని తెలిపారు భక్తుల సౌకర్యమే మా మొదటి ప్రాధాన్యత అని నిర్మితమవుతున్న రాజధాని అమరావతి లో ఈ అమ్మవారి దేవస్థానం ప్రత్యేక పాత్ర పోషించబోతుంది అని అన్నారు ప్రారంభించిన భవనాల ద్వారా 60 వేల లడ్డులు ఒక గంటలకు తయారు కానున్నాయి అని ఒకే సారి 10 వేల మందికి ఒక గంటల లో భోజనం చేసే సౌకర్యం ఏర్పాటు చేసాము అని అన్నారు రాబోయే దసరాకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించాము అని దసరా ను అంగరంగ వైభవం గా జరిపిస్తాం అని కూటమి ప్రభుత్వశీ ఆధ్వర్యంలో లోనే దేవాలయాల అభివృద్ధి జరుగుతుంది అని ఎంపీ చిన్ని స్పష్టం చేశారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ను కోరుతూ ఢిల్లీ వేదికగా పోరుబాట

పెద్దాపురం/ఆనూరు, ఆగస్ట్ 21(పల్లె వెలుగు



దినపత్రిక) ఆగస్టు 12న దేశ రాజధాని న్యూఢిల్లీ ఆంధ్ర భవన్ వేదికగా ఇండియన్ క్రిస్టియన్ ఫెడరేషన్ (ఐసిఎఫ్) మహాసభ జాతీయ అధ్యక్షులు జార్జి శ్రీమంతులు నాయకత్వం లో జరిగిన కార్యక్రమానికి ఐసిఎఫ్ ప్రతినిధి బృందం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలు క్రైస్తవ సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దళిత క్రైస్తవుల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, షెడ్యూల్డ్ కులాల వారికి (ఎస్సీ) హోదా సాధనే లక్ష్యంగా జాతీయ స్థాయి పోరాట కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా జార్జి శ్రీమంతుల నాయకత్వంలో భారత రాష్ట్రపతి కార్యాలయం మరియు ప్రధాన మంత్రి కార్యాలయాలకు (పీఎంఓ) మరియు జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎం.సి ఎస్.సి) కి అధికారికంగా వినతిపత్రాలు అందజేసి, రసీదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జార్జి శ్రీమంతుల మాట్లాడుతూ 1950 రాజ్యాంగ



(షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులోని మూడవ పేరా ప్రకారం, హిందూ మతం కాకుండా ఇతర మతాల్లోకి మారిన దళితులకు ఎస్సీ హోదా నిరాకరించబడింది. అనంతరం బౌద్ధ, సిక్కు మతాలకు ఈ హోదా విస్తరించినప్పటికీ, క్రైస్తవ మరియు ఇస్లాం మతాల్లో కి మారిన దళితులకు ఇది వర్తించలేదు. మతం మారినప్పటికీ వారి సామాజిక స్థితిగతులు, వివక్ష, వెనుకబాటు తనం మారలేదని రంగనాథ్ మిశ్రా కమిషన్, జస్టిస్ కే.జి. బాలకృష్ణన్ కమిషన్ వంటి అధ్యయనాలు స్పష్టం చేశాయి. ఆర్టికల్ 14, 15, 25 ఉల్లంఘన: మతం ఆధారంగా సంక్షేమ హక్కులను నిరాకరించడం రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ హక్కుకు, మత స్వేచ్ఛకు విరుద్ధమని దళిత క్రైస్తవ సమాజం దశాబ్దాలుగా పోరాడుతోంది.

దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న తీవ్ర సామాజిక వివక్ష, విద్య, ఉద్యోగ అవకాశాల లేమి, సంక్షేమ ఫలాలు అందకపోవడం వంటి సమస్యలను ఎన్సీఎస్సీ దృష్టికి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలువురు కీలక నాయకులను సైతం కలిసి సమస్య పరిష్కారానికి మద్దతు కోరారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులోని పేరా 3ని సవరించి, మతంతో సంబంధం లేకుండా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లతో పాటు ఎస్సీ/ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం (పి.ఓ.ఏ యాక్ట్) పరిధిలోకి తీసుకువచ్చి రక్షణ కల్పించాలి, కేంద్ర ప్రభుత్వం దళిత క్రైస్తవుల సమస్యలపై వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ ఢిల్లీ పర్యటన మరియు వివిధ రాజ్యాంగబద్ధ వ్యవస్థలకు వినతిపత్రాల సమర్పణ దళిత క్రైస్తవుల హక్కుల సాధనలో ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఇండియన్ క్రిస్టియన్ ఫెడరేషన్ (ఐ సి ఎఫ్) నాయకత్వం స్పష్టం చేసింది. న్యాయం జరిగేంత వరకు తమ పోరాటాన్ని దేశవ్యాప్తంగా కొనసాగిస్తామని ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల క్రైస్తవ ప్రతినిధులు ఒకే వేదిక పైకి వచ్చి దళిత క్రైస్తవుల సామాజిక న్యాయం, సమానత్వం మరియు రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం గళమెత్తారు.

## కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం లో పాల్గొన్న ఎంపీ కేసినేని చిన్ని,ఎమ్మెల్యే సుజనా చౌదరి

విజయవాడ,ఆగస్టు 21(పల్లె వెలుగు దినపత్రిక)





విజయవాడ 48వ డివిజన్ చిట్టినగర్ లో నగరాల సీతారామ స్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు.ఈ సందర్భంగా 27 మంది నూతన కమిటీ సభ్యుల తో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పోతిన బేసు కంటేశ్వరుడు, గౌరవ అధ్యక్షుడిగా రాయన ఆదిబాబు, కార్యదర్శిగా తొత్తడి భారత్, కోశాధికారిగా బెవర సాయి సుధాకర్ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఎంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ ముందుగా నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు శ్రావణ శుక్రవారం రోజున ప్రమాణ స్వీకారం చేయడం నిజంగా పాలకమండలి అదృష్టమని ఇది ఒక గొప్ప విషయమని అన్నారు నగరాల గురించి చెప్పుకోవాలంటే చాలా ఉందని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో నగరాల పాత్ర అత్యంత కీలకమైనదని ఎంపీగా తన గెలుపు స్థానిక ఎమ్మెల్యే గెలుపులో కూడా నగరాల పాత్ర మరువలేనిదని తెలియజేశారు నగరాల సామాజిక వర్గం నుండి ఎందరో మంది గొప్ప నాయకులు వచ్చారని మరిపిళ్ల చిట్టిబాబు గారి నూతన పెద్ద విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని తెలియజేశారు ప్రభుత్వం ఇస్తున్న అన్ని అవకాశాలను స్థానిక ఎమ్మెల్యే కూడా కలుపుకొని మరిన్ని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు నగరాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వంతో పాటు తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటామని ఎంపీ చిన్ని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో భక్తులు, నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## డ్వాక్రా సంఘాల బ్యాంకింగ్ కష్టాలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే వేగుళ్ళ

- **మహిళా సాధికారతకు బ్యాంకుల సహాయ నిరాకరణ తగదు.**
- **సులభతర రుణ ప్రక్రియ, పారదర్శక వడ్డీ విధానం అమలు చేయాలని డిమాండ్**
- **డ్వాక్రా మహిళల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి**

అమరావతి/మండపేట,ఆగస్ట్ 21 పల్లె వెలుగు రాష్ట్రం లో మహిళా సాధికారతకు వెన్నెముకగా నిలుస్తున్న స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) బ్యాంకుల ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మండపేట శాసనసభ్యులు శ్రీ వేగుళ్ళ జోగేశ్వరరావు శాసనసభ దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయనమాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో డ్వాక్రా మహిళలు బ్యాంకింగ్



సేవల విషయంలో పడుతున్న సమస్యలను సమగ్రంగా సభలో ప్రస్తావించారు.రుణాల మంజూరులో జాప్యం: బ్యాంకులు నిబంధనల పేరుతో మహిళా గ్రూపులను పలుమార్లు తిప్పుకుంటున్నాయని, సకాలంలో రుణాలు అందక వ్యాపారాలు, జీవనోపాధి దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.వడ్డీ రేట్లు, సర్వీస్ చార్జీలు: వడ్డీ రాయితీలు, సున్నా వడ్డీ పథకాల అమలులో కొన్ని బ్యాంకులు చూపుతున్న నిర్లక్ష్యం వల్ల మహిళలపై అదనపు భారం పడుతోందని వివరించారు. పత్రాల సమర్పణ ఘ సాంకేతిక ఇబ్బందులు: కేవైసీ, డాక్యు మెంటేషన్, ఆన్‌లైన్ ప్రక్రియల్లో వస్తున్న సాంకేతిక సమస్యల కారణంగా గ్రామీణ మహిళలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. కొన్ని బ్యాంక్ శాఖల్లో మహిళా సంఘాల పట్ల సిబ్బంది సహాయ నిరాకరణ ధోరణి కనబరుస్తున్నారని, ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు అవసరమని నొక్కిచెప్పారు.డ్వాక్రా సంఘాలకు బ్యాంకింగ్ ప్రక్రియను అత్యంత సులభతరం చేసేందుకు రాష్ట్ర స్థాయిలో బ్యాంకర్ల కమిటీ తో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలి. రుణాలు నేరుగా, ఎలాంటి అనవసర ఆంక్షలు లేకుండా త్వరితగతిన గ్రూపు ఖాతాల్లో జమయ్యేలా నిబంధనలను సరళీకృతం చేయాలి. వడ్డీ జమ తదితర అంశాల్లో పారదర్శకత ఉండేలా జిల్లా స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బ్యాంకులతో సమన్వయం సాధించాలని వేగుళ్ళ జోగేశ్వరరావు కోరారు

# రూ.50 లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిగా ముసలమ్మ తల్లి

కడియపులంక, ఆగస్టు 21 (పల్లె వెలుగు



దినపత్రిక) తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంకలో కొలువై ఉన్న శ్రీ ముసలమ్మ అమ్మవారు శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులకు అపూర్వమైన రూపంలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.50 లక్షల విలువైన కరెన్సీ నోట్లు, నాణేలతో ధనలక్ష్మి స్వరూపిణిగా అత్యంత వైభవంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు రెండు రోజులపాటు ప్రత్యేకంగా శ్రమించి ఒక రూపాయి నాణెం నుంచి రూ.500 నూతన కరెన్సీ నోట్ల వరకు వివిధ విలువల నోట్లతో అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు ఆలయ ప్రధాన అర్చకులు స్వామి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజమహేంద్రవరం, కడియం, మండపేట, ఆలమూరు మండలాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ, ఆరున్నర దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన ముసలమ్మ తల్లి భక్తుల కోర్కెలను తీర్చే చల్లని తల్లిగా ప్రసిద్ధి చెందిందన్నారు. ఏడేళ్ల క్రితం రూ.5 లక్షలతో ప్రారంభించిన కరెన్సీ అలంకరణను ఈ ఏడాది రూ.50 లక్షలకు విస్తరించి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ మహిళా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక హారతులు, భక్తి గీతాలాపనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పాల్గొన్నారు

# ముమ్మరంగా ఇంటింటికీ టీడీపీ - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం, ఆగస్టు 21 (పల్లె వెలుగు



దినపత్రిక) రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు సమగ్ర అభివృద్ధిని వేగవంతం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ టీడీపీ – – ఇంటింటికీ సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా 15వ డివిజన్ తాడితోటలో ఎమ్మెల్యే డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను పలకరించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 'సూపర్ సిక్స్' హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పింఛన్ల పెంపు, 'తల్లికి వందనం', 'దీపం-2' ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణం, 'అన్నదాత సుఖీభవ', అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ వంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని వివరించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం నగర మౌలిక వసతులు, డ్రైనేజీలు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# కొత్తపేట నియోజకవర్గం అంతటా ఘనంగా బండారు సంజీవ్ జన్మదిన వేడుకలు

కొత్తపేట, ఆగస్టు 21 (పల్లె వెలుగు దినపత్రిక) కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



తనయుడు, యువ నాయకుడు బండారు సంజీవ్ జన్మదిన వేడుకలను నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. రావులపాలెం గ్రామంలోని తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో రావులపాలెం మండలం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే వాడపాలెం గ్రామంలో అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించి, పేదలకు స్వీట్లు, దుప్పట్లు మరియు పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వాడపాలెం గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి బండారు రాజేష్ సమకూర్చిన రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని బండారు సంజీవ్ చేతుల మీదుగా ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కొత్తపేటలోని పాత బస్టాండ్ సెంటర్‌లో అభిమానులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటి, చికిత్స పొందుతున్న రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక అన్న క్యాంటీన్‌లో కొత్తపేట నియోజకవర్గం తెలుగు యువత ఆధ్వర్యంలో బండారు సంజీవ్ చేతుల మీదుగా పేదలకు ఉచిత భోజన వితరణ చేపట్టారు. జన్మదిన వేడుకలు జరుపుకున్న బండారు సంజీవ్‌కు పలువురు ప్రముఖులు, నాయకులు, అభిమానులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సేవా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, తెలుగు యువత ప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ముత్యాల సతీష్ (సంజు బాబు) జన్మదిన వేడుకలు

అనకాపల్లి, ఆగస్ట్21(పల్లె వెలుగు ప్రముఖ




వ్యాపారవేత్త, భారతీయ జనతా పార్టీ నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్) తనయుడు ముత్యాల సతీష్ (సంజు బాబు) జన్మదిన వేడుకలు శుక్రవారం అనకాపల్లి లో అత్యంత వైభవంగా, పండుగ వాతావరణం లో జరిగాయి. పట్టణంలోని నర్సింగరావుపేటలో ఎం.వి.ఆర్ ప్రధాన కార్యాలయ ప్రాంగణం అభిమానులు, నాయకులు, ఎం.వి.ఆర్ యువసేన కార్యకర్తల కోలాహలంతో సందడిగా మారింది. "హ్యాపీ బర్త్ డే సంజు బాబు" అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది.జన్మదినం సందర్భంగా సంజు బాబు ముందుగా తన తల్లిదండ్రులైన ముత్యాల వెంకటేశ్వరరావు, సూర్యకుమారి దంపతుల పాదపద్మాలకు నమస్కరించి వారి దివ్య ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం అన్నయ్య ముత్యాల రాజేష్, వదిన రమ్యలు ఆత్మీయంగా అభినందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎం.వి.ఆర్ యువసేన కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది, అభిమానుల సమక్షంలో సంజు బాబు భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యాలయానికి చేరుకుని ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలు, బొకేలతో ఘనంగా సత్కరించారు. ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.ఆర్ కుటుంబ సభ్యులు, యువసేన ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు ఎ.కోడూరుకు సీఎం చంద్రబాబు ! పటిష్ట భద్రత, ట్రాఫిక్ ఆంక్షలు

అనకాపల్లి/ఎ.కోడూరు, ఆగస్ట్ 21పల్లె వెలుగు అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరు గ్రామంలో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాని కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలు మరియు వాహనదారులకు అసౌకర్యం కలగకుండా విస్తృత బందోబస్తుతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఆగస్టు 22 ఉదయం 7:00 గంటల నుంచి ఎ.కోడూరు మీదుగా వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించారు.పినగాడి



నుంచి దేవరాపల్లి వెళ్లే భారీ వాహనాలు కొత్తవలస మీదుగా వెళ్లాలి. దేవరాపల్లి నుంచి విశాఖపట్నం మార్గంలో వెళ్లే వాహనాలు కొత్తవలస వైపు డైవర్ట్ చేయబడ్డాయి.దేవరాపల్లి నుంచి అనకాపల్లి, చోడవరం వాహనదారులు ప్రత్యామ్నాయ గ్రామీణ లింక్ రోడ్లను వినియో గించుకోవాల్సి ఉంటుంది.సభా ప్రాంగణానికి వచ్చేవారికి ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించామని, వాహనదారులు పోలీసుల సూచనలు పాటించి సహకరించా లని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలుకు క్లబ్ ఎక్సలెన్స్ ప్రతిష్టాత్మక అవార్డు

నిడదవోలు, ఆగస్టు 21 (పల్లె వెలుగు దినపత్రిక) రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020




పరిధిలోని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు 2025-26 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన క్లబ్ ఎక్సలెన్స్ అవార్డు సాధించింది. సమాజ శ్రేయస్సు కోసం క్లబ్ నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలు, రోటరీ ఆశయాల సాధనకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. కమ్యూనిటీ సర్వీస్, వొకేషనల్ సర్వీస్, న్యూ జనరేషన్ సర్వీస్, పబ్లిక్ ఇమేజ్, వ్యాధుల నివారణ, నీరు మరియు పరిశుభ్రత, మాతృశిశు సంక్షేమం వంటి వివిధ విభాగాలలో క్లబ్ సాధించిన పురోగతికి గాను ఇతర పలు అవార్డులు కూడా లభించాయి. ఈ సందర్భంగా 2025-26 రోటరీ క్లబ్ అధ్యక్షులు మీసాల శివరామ హరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, కోశాధికారి గుంటుపల్లి సత్య సాయి మరియు క్లబ్ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. సభ్యులందరి ఐక్యత, అంకితభావం మరియు సేవాతత్వమే ఈ ఘనతకు కారణమని, భవిష్యత్తులో మరిన్ని ప్రజాసేవా కార్యక్రమాలు చేపడతామని ప్రతినిధులు పేర్కొన్నారు.

# ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి దేవస్థానంలో దిగ్విజయంగా నిత్యాన్నదానం



ర్యాలి, ఆగస్టు 21 (పల్లె వెలుగు దినపత్రిక) డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి దేవస్థానానికి ప్రతి రోజూ భక్తులు విశేష సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటున్నారు. దర్శనానంతరం దేవస్థానంలో క్రమం తప్పకుండా ప్రతిరోజు నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు మరియు కార్యనిర్వాహణాధికారి ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారి సేవలో భాగంగా భక్తులందరికీ ప్రసాద వితరణ సజావుగా సాగేలా గట్టి చర్యలు చేపట్టారు

# వైసీపీ నేత తమ్మన శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు


ఆలమూరు, ఆగస్టు 21 (పల్లె వెలుగు దినపత్రిక) ఆలమూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్



పార్టీ కన్వీనర్ తమ్మన శ్రీనివాస్‌కు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అక్రమంగా అరెస్ట్ చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించారని, విచారణ అనంతరం కోర్టు బెయిల్ మంజూరు చేయడం ధర్మం సాధించిన విజయమని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. అక్రమ కేసులతో పార్టీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రభుత్వం ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు. కోర్టు నిర్ణయంతో తమకు న్యాయవ్యవస్థపై ఉన్న నమ్మకం మరింత బలపడిందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. శ్రీనివాస్ అరెస్ట్ సమయంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, జైలు ములాఖత్‌లో కలిసి పార్టీ నాయకత్వం ధైర్యం చెప్పిందని గుర్తుచేశారు. కేసులు, అరెస్టులకు భయపడేది లేదని, ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బెయిల్ లభించడంతో ఆలమూరు మండలంలోని పార్టీ శ్రేణులు, నాయకులు, కుటుంబ సభ్యులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు, హక్కుల సాధన కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు వెల్లడించారు

# అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొండా

విజయవాడ,ఆగస్టు 21(పల్లె వెలుగు దినపత్రిక): అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై



ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసం తోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు ఆకాంక్షించారు. విజయవాడ భానునగర్ లో బొండా ఉమా కాలనీలో శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి, పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వీరమాచినేని లలిత, వీరమాచనేని కిషోర్, డివిజన్ ప్రెసిడెంట్ శ్రీను , సెక్రటరీ పవన్,, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సహకార సంఘాల్లో యూరియా పంపిణీ ప్రారంభం

## రైతు సేవ యాప్‌తో బయోమెట్రిక్ ద్వారా ఎరువుల పంపిణీ



కాట్రేనికోన, (పల్లె వెలుగు దినపత్రిక): ఆగస్టు 21: పల్లంకుర్రు, కందికుప్ప సహకార సంఘాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి బి. మృదుల తెలిపారు. ఆధార్, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ అనుసంధాన మొబైల్‌తో రైతులు రావాలని సూచించారు. 'రైతు సేవ' యాప్‌లో బయోమెట్రిక్ ధ్రువీకరణ అనంతరం యూరియా అందిస్తున్నట్లు తెలిపారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com